

తండాల్లో నీటిగోస 2



ఐకేపీ ఆధ్వర్యంలో అవగాహన 2

AKSHARA TODAY
# అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in



ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం - మిగతా 2వ పేజీలో..






## ముగ్గురు కూతుళ్లను హత్యచేసిన తండ్రి రిమాండ్

**అక్షరటుడే, కామారెడ్డి:** ముగ్గురు కూతుళ్లను నిర్దాక్షిణ్యంగా చెరువులోకి తోసి హత్య చేసిన తండ్రిని రిమాండ్ చేసినట్లు కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. సబ్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆర్బీ నగర్‌కు చెందిన ముగ్గురు చిన్నారులు కనిపించడం లేదని శనివారం పోలీసులకు ఫిర్యాదు అందిందని ఏఎస్పీ తెలిపారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలతో ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టామన్నారు. పిల్లలను ఎక్కడెక్కడికి తీసుకెళ్లారో తండ్రి చెప్పిన ప్రకారం సీసీ పుటేజీలను పరిశీలించగా అలాంటి ఆధారాలు ఏమీ లభించలేవని తెలిపారు. అక్కడ ఇక్కడ అంటూ తిప్పుతున్న తండ్రిపై అనుమానం వచ్చి విచారించగా చెరువు వద్దకు తీసుకెళ్లి చెరువులో తోసేసినట్లు చెప్పాడని తెలిపారు. అప్పుల భారం, ముగ్గురు కూతుళ్లను పోషించలేకనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు అనుమానిస్తున్నామని తెలిపారు. నిందితుడిని కోర్టులో రిమాండ్ చేశామని, కస్టడీకి తీసుకుని పూర్తి విచారణ చేపడతామని పేర్కొన్నారు. కామారెడ్డి పట్టణంలోని గోసంగి కాలనీకి చెందిన ఇద్దరు బాలురను త్వరలో పట్టుకుంటామని ఏఎస్పీ చైతన్య రెడ్డి తెలిపారు. ఈ నెల 6న పిల్లలు అదృశ్యమైనట్లు తమకు ఫిర్యాదు వచ్చిందన్నారు. పిల్లలు రోజు ఎక్కడెక్కడికి వెళ్తారనే విషయాలపై ఆరా తీస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆ ఇద్దరిని కూడా పట్టుకుంటామన్నారు. ఈ సమావేశంలో కామారెడ్డి పట్టణ, రూరల్ సీఐలు నరహరి, రామన్ పాల్గొన్నారు.




## మహిళా ఉపాధ్యాయులకు అండగా ప్రభుత్వం

**అక్షరటుడే, ఇందూరు:** మహిళా ఉపాధ్యాయులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని ప్రభుత్వ సలహాదారు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి తెలిపారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పాఠశాలలో తల్లిపాత్రను పోషిస్తూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చేదిద్దాలన్నారు. అనంతరం పీఆర్టీయూ అధ్యక్ష కార్యదర్శులు మోహన్ రెడ్డి, కిషన్ మాట్లాడుతూ పీఆర్టీయూ సంఘం మహిళలకు 5 సీఎల్‌లు ఇప్పించడంలో ప్రధాన పాత్ర పోషించిందన్నారు. అలాగే చైల్డ్ కేర్ సెలవులు పెంచడంలోనూ పీఆర్టీయూ కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అంకం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లారు ముద్దుగా పిల్లలను పెంచాల్సిన తల్లిదండ్రులే వారిని అంతం చేస్తున్నారు. కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన వారు హత్యలు చేయడానికి వెనుకాడటం లేదు. పిల్లలకు చిన్న దెబ్బ తగిలితే తల్లడిల్లాల్సిన వారు.. కనికరం లేకుండా వ్యవహరిస్తున్నారు. అప్పులు బాధలు, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, వివాహేతర సంబంధాలు.. కారణాలు ఏవైనా కొంతమంది తమ బిడ్డలను చంపుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఇలాంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. కామారెడ్డిలో ఓ తండ్రి శనివారం ముగ్గురు పిల్లలను చెరువులో తోసి హత్య చేయడం కలకలం రేపుతోంది.

- అక్షరటుడే, కామారెడ్డి



# కన్న పేగుపై కర్కశత్వం

- పిల్లలను చంపుతున్న తల్లిదండ్రులు
- చిన్న కారణాలతో హత్యలు
- ఆందోళన కలిగిస్తున్న ఘటనలు

పిల్లలు తప్పు చేస్తే ఆ తప్పుకు పునాది తల్లిదండ్రులదే అని భావించాలి. తల్లిదండ్రులు చేసే తప్పులు పిల్లల కంట్లో పడితే పిల్లలు కూడా అవే తప్పులు చేసేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటోంది. ఈ విషయాన్ని గమనించని కొంతమంది తల్లిదండ్రులు అదే పనిగా పిల్లల ముందు తప్పులు చేస్తున్నారు. ఆ తప్పు చేసిన పిల్లల పట్ల తల్లిదండ్రులు అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. ఆ తప్పుకు తమవైపు బాధ్యత ఉందో లేదో ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదు.

### సన్నగిల్లుతున్న భద్రత

తల్లి, తండ్రి ఇద్దరిలో ఎవరో ఒకరు తమతో ఉంటే భద్రత ఉంటుందని పిల్లలు భావిస్తుంటారు. తమకు ఏమైనా తన వెనక తల్లి, తండ్రి ఉన్నారని ధైర్యంగా ఉంటున్నారు. ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలతో పిల్లలు అభద్రతా భావంలోకి వెళ్తున్నారు. తల్లిదండ్రులు తమ పట్ల తీసుకుంటున్న భద్రతపై నమ్మకం సన్నగిల్లుతోంది.

### పిల్లల విక్రయాలు.. హత్యలు

కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను అవసరాలకు వాడుకుంటున్నారు. కుటుంబ పోషణ చేయలేకపోతున్నామని, అప్పులు ఎక్కువయ్యాయని, ఇతర అవసరాలతో కొంతమంది తల్లిదండ్రులు తమ కన్నపేగును మరిచి అంగట్లో పిల్లలను విక్రయిస్తున్నారు. ఇలాంటి ఘటనలు కామారెడ్డిలో వెలుగుచూసిన సందర్భాలు ఉన్నాయి. మరికొంత మంది హత్యలు చేయడానికి కూడా వెనుకంజ వేయడం లేదు.

### ముగ్గురు బిడ్డల దారుణ హత్య

కామారెడ్డి పట్టణంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన సిపాత్, ఆయాత్, మరియం అనే బాలికలను కన్నతండ్రే దారుణంగా హత్య చేశాడు. వారిని చెరువులో తోసేశాడు. అనంతరం కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమానం వచ్చిన పోలీసులు తమదైన శైలిలో విచారించగా చెరువులో పడేసి హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. అభంశుభం తెలియని పసిమొగ్గలు విగతజీవులుగా చెరువులో తేలియాడటం ప్రతిఒక్కరిని కంటతడి పెట్టించింది. ఈ ఘటనలో తండ్రిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

### గతంలో జరిగిన ఘటనలు

మూడు నెలల క్రితం కామారెడ్డి పట్టణంలో ఓ షటర్ వద్ద తన బిడ్డతో పడుకున్న తల్లి బయటకు వెళ్లి వచ్చే లోపు బిడ్డ కనిపించలేదు. కన్నతండ్రే బిడ్డను ఎత్తుకెళ్ళి ఓ వైన్ షాపు ముందు విక్రయించడానికి సిద్ధమవగా పోలీసులు పట్టుకున్నారు. గతేడాది మే 7న పోల్కంపేట గ్రామానికి చెందిన భార్యాభర్తలు బంధువుల ఇంటికి వెళ్లగా అక్కడ చిన్నపాటి గొడవ జరిగింది. ఈ గొడవకు తన కొడుకు కారణమని భావించిన తండ్రి బైక్‌పై తీసుకెళ్లి హత్య చేశాడు. లింగంపేట మండలానికి చెందిన ఓ మహిళ సహజీవనం చేస్తున్న వ్యక్తి కోసం తన కన్న బిడ్డను అమ్మకానికి పెట్టింది. ప్రియుడికి ఆటో కొనివ్వడానికి కన్న బిడ్డను రూ.50 వేలకు విక్రయించింది. ఈ ఘటన 2025 జూన్ 13న చోటు చేసుకుంది.




## థాయిలాండ్ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ట్రాన్స్‌కో ఉద్యోగుల ప్రతిభ

**అక్షరటుడే, ఇందూరు:** థాయిలాండ్ ఓపెన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో నిజామాబాద్ విద్యుత్ ఉద్యోగులు అద్భుత ప్రతిభను కనబర్చారు. దేశానికి ప్రాతినిధ్యం వహించి పలు పతకాలను కైవసం చేసుకున్నారు. శాఖలో సీనియర్ అసిస్టెంట్ గోపి 40 ఏళ్ల పైబడిన వయసు కేటగిరిలో 110 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు పతకం, 4×100, 4×400 రిలే రన్నింగ్‌లో మూడు రజత పథకాలు సాధించాడు. అలాగే సీనియర్ అసిస్టెంట్ రఘువీర్ 45 పైబడిన వయస్సు విభాగంలో హ్యామర్ త్రోలో రజతం, షాట్‌పుట్‌లో కాంస్య పతకం సాధించారు. దినేష్ 40ఏళ్ల వయసు విభాగంలో రిలే రన్నింగ్ పోటీల్లో రెండు రజత పతకాలు సాధించారు.

## సమాజంలో ఐక్యతకు దేవాలయాలు దోహదం



**అక్షరటుడే, ఇందూరు:** సమాజంలో ఐక్యత, శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందేందుకు దేవాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని కాలనీలో ఇందూర్ ఘడ్ జగదాంబ సేవాలాల్ మహారాజ్ దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపనను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. జగదాంబ సేవాలాల్ మహారాజ్ కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి రమేష్, కార్పొరేటర్లు శశాంక్ రెడ్డి, నాగోల లక్ష్మీనారాయణ, జ్యోతి మురళి ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.





## బంజారాలతో స్టెప్పులేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, బోధన్:** బోధన్ పట్టణంలో సంత్ సేవాలాల్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ శివారులోని బంజారా భవన్ కోసం కేటాయించిన స్థలంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం ఆలయంలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బంజారాలకు పెద్దపీట వేస్తున్నామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నరేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, మహిళా సంఘాలకు రుణాలు, మహిళలకు మహాలక్ష్మి పథకం ఇలా అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలవుతున్నాయన్నారు. ప్రతిపక్షాలు తమ పబ్బం గడుపుకునేందుకు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అనంతరం బంజారాలతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ స్టెప్పులు వేసి ఆడి పాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నుడా చైర్మన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పక ఇప్పించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**అక్షరటుడే, ఇందూరు:** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిరోధించేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను బాలికలకు తప్పనిసరిగా ఇప్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో వ్యాక్సినేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 14 నుంచి 17 ఏళ్ల మధ్య వయసు కలిగిన బాలికలు అందరికీ కచ్చితంగా వాక్సిన్ ఇప్పించాలన్నారు. ఇది ఎంతో ఉపయోగకరమైనదని, దీన్ని తీసుకోవడం వల్ల 95శాతం వరకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను నిరోధించవచ్చన్నారు. వ్యాక్సిన్ పట్ల ఎటువంటి అపోహలు అవసరం లేదని తెలిపారు. జిల్లాలో 12,363 మంది బాలికలు ఉన్నారని, వారందరికీ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఇప్పటివరకు కేవలం ప్రైవేట్ ఆస్పత్రుల్లోనే అందుబాటులో ఉండేదని, సర్వైకల్ క్యాన్సర్‌ను నిర్మూలించాలని లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని తెలిపారు. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు డిచ్‌పల్లి, ధర్పల్లి, నవీపేట్, వర్ని, మోర్తాడ్ బాల్కొండ, ఆర్మూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో కూడా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వ్యాక్సిన్ వేయించుకున్న వారు సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. వ్యాక్సిన్ తీసుకున్న వారిలో శారీరక బలహీనత వల్ల కొంతమందికి అలసట, జ్వరం వంటి లక్షణాలు కనిపించవచ్చని, అయితే ఏమాత్రం భయపడకుండా పారాసిటమాల్ టాబ్లెట్ వేసుకుంటే సరిపోతుందన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికలతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ రాజశ్రీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అశోక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ సూపరింటెండెంట్ రాములు, డీపీహెచ్ఎస్ శ్రీనివాస ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో అశ్విని, నర్సింగ్ సూపరింటెండెంట్ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



## రెండో వార్డులో పారిశుద్ధ్య పనులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, వార్డు కౌన్సిలర్ మంచిర్యాల మహేశ్వరి విద్యాసాగర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మహేశ్వరి మాట్లాడుతూ కార్యక్రమంలో వార్డు ప్రజలందరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఈరోజు రెండవ వార్డ్‌లో చేపట్టిన పారిశుధ్య పనులు మూడు రోజులు కొనసాగుతాయని తర్వాత కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సూచించిన పనులను ప్రణాళిక బద్ధంగా ప్రతిరోజు నిర్వహిస్తామన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ సహకారంతో మున్సిపాలిటీలో 2వ వార్డ్‌ను ఉత్తమ వార్డుగా తీర్చి దిద్దుతామన్నారు. వార్డులో ఏ సమస్య ఉన్న ఒక్క ఫోన్ కాల్ చేస్తే 24 గంటలు అందుబాటులో ఉంటామని వార్డ్ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ మహేష్‌తో పాటు, కాంగ్రెస్ నాయకులు మంచిర్యాల విద్యాసాగర్, వార్డ్ ఆఫీసర్ అవినాష్, మున్సిపల్ సిబ్బంది ప్రశాంత్, బాలరాజు, కిషన్, వార్డ్ ప్రజలు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో స్వచ్ఛభారత్



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఆవరణలోని రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం ఆవరణలో ఆదివారం స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా సంఘ భవనం ఆవరణలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకె శ్రీనివాస్ మాట్లాడుతూ ఆదివారం సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం ఆవరణలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించామని ఇందులో విశ్రాంత ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారన్నారు. ప్రతి ఆదివారం ఒక గంట నినాదంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం నిర్వి రామంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏనుగు రాజేశ్వర్ రెడ్డి, వన్నెలేవి గంగాధర్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుంకె నిశాంత్, వేదశ్రీ రాజ్ కుమార్, డ్రైవింగ్ స్కూల్ వేణు, చోల రాకేష్, కుతాడి ఎల్లయ్య, సాయి చరణ్, సుమన్, రాహుల్ రాజ్, కృషివర్ధన్ పాల్గొన్నారు.

వేసవి ప్రారంభంలోనే నీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోరు బావుల్లో అరకొరగా నీళ్లు వస్తున్నాయి. మరోవైపు మిషన్ భగీరథ నీళ్లు అంతంతమాత్రంగానే వస్తుండడంతో గాంధారి మండలంలోని తండాల్లో ప్రజలు నీటికోసం అల్లాడుతున్నారు. నీటిసమస్య పరిష్కరించాలని అధికారులను కలిసి విన్నవిస్తే.. హామీలివ్వడం తప్ప.. పరిష్కార మార్గం చూపట్లేదని వారు ఆగ్రహ వ్యక్తం చేస్తున్నారు. – అక్షరటుడే, గాంధారి

# తండాల్లో నీటిగోస



- వేసవి ప్రారంభంలోనే తాగునీటి తిప్పలు
- అల్లాడుతున్న ప్రజలు
- పూర్తిగా అందని మిషన్ భగీరథ నీళ్లు
- గాంధారిలోని నాగులూరు, తిప్పారం తండాల్లో నీటికష్టాలు

గాంధారి మండలంలోని నాగులూరు తండాలో దాదాపు 350 వరకు జనాభా ఉంటుంది. అయితే అక్కడ మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాకపోవడంతో పరిస్థితి దారుణంగా మారిందని తండావాసులు పేర్కొన్నారు. ఇంతేకాకుండా గ్రామానికి ఒకేఒక్క బోరు ఉండడంతో ఈ సమస్య ఇంకా తీవ్రమైంది. మిషన్ భగీరథ అధికారులు పైప్‌లైన్ల నిర్మాణంలో నిబంధనలు పాటించకపోవడంతో కిందివైపు తండావాసులకు వేగంగా నీళ్లు వెళ్లిపోతున్నాయని.. ఎగువన ఉన్నవారికి నీళ్లురావట్లేదని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై సర్పంచ్ సంతోష్ మాట్లాడుతూ.. అందరికీ నీళ్లు వచ్చేవిధంగా మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. అలాగే తండాలో మరో బోరు వేయించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు.



### తిప్పారం తండాలో మరీ అధ్వానం..

మండలంలోని తిప్పారం తండాలో ప్రజల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఈ తండాలో సుమారు. 650 మంది ప్రజలు ఉండగా మిషన్ భగీరథ నీళ్లు వారానికి రెండుసార్లు మాత్రమే వస్తున్నాయి. దీంతో ప్రజలు ఈ నీటి కోసం యుద్ధాలే చేస్తున్నారు. తండాల్లోని చెలిమల్లో నీళ్లు పట్టుకుని వాటినే పొదుపుగా వాడుకునే పరిస్థితి నెలకొంది. అధికారులు వచ్చి తమ సమస్యకు పరిష్కారం చూపిస్తామని ఎన్నో ఏళ్లుగా చెబుతున్నారని.. కానీ పరిష్కారం మాత్రం కావట్లేదని వాపోతున్నారు. దాదాపు కిలోమీటర్ దూరం నుంచి మంచినీటి మోసుకుంటున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు.

### అధికారులు స్పందించాలి..

తాగునీటి కోసం నాగులూర్, తిప్పారం తండాలో ప్రజలు అల్లాడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఆయా తండాల్లో నీటిగోసను పరిష్కరించాలని కోరుతున్నారు. వేసవి ప్రారంభం నుంచే పరిస్థితి ఇలా ఉంటే నిండు వేసవిలో ఎలా ఉంటుందోనని వారు ఆందోళన చెందుతున్నారు.

## వెల్మల్‌లో ఇఫ్తార్ విందు..

**అక్షరటుడే, ఆర్మూర్:** మండలంలోని వెల్మల్ గ్రామంలో సర్పంచ్ గోజ్జి దేవేందర్ ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోజ్జి దేవేందర్ మాట్లాడుతూ.. రంజాన్ మాసం శాంతి, సహనం, పరస్పర ప్రేమను పెంపొందించే పవిత్రమైన కాలమని తెలిపారు. గ్రామంలో అన్ని మతాల ప్రజలు ఐకమత్యం, సోదరభావంతో జీవించడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, నాయకులు పాల్గొన్నారు.



## నల్లూరులో తడి–పొడి చెత్తపై అవగాహన



**అక్షరటుడే,ముప్కాల్:** ముప్కాల్ మండలం నల్లూరు గ్రామంలో 'ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా తడిపొడి చెత్త వేరు చేసే కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు చెత్తను వేర్వేరు విధంగా వర్గీకరించడం వల్ల గ్రామంలో పరిశుభ్రత పెరుగుతుందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బర్కం గంగాధర్, ఉప సర్పంచ్ బర్కం లావణ్య శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి విఘ్నేష్, వార్డు సభ్యులు అక్కవత్రి ప్రవీణ్ కుమార్, ఫణీందర్ గౌడ్, సోని, చిన్నయ్య, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, ఆశావర్కర్లు రాధిక, సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.



## మహిళా సంఘాలకు ఐకేపీ ఆధ్వర్యంలో అవగాహన

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలో ఆదివారం ఐకేపీ కార్యాలయంలో ఆదివారం మహిళా సంఘం సభ్యులకు సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ సీఈవో చందర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గురించి 99 రోజుల కార్యక్రమం గురించి వివరించారు. తీసుకున్న రుణాలను చెల్లించేలా మహిళలకు అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకునేలా మహిళలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీఈవో లక్ష్మీనారాయణ వీవోఏ లక్ష్మీ ప్రియ, సీసీ గొర్రె రాములు, సంఘాల లీడర్లు పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..




# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఆర్మూర్‌లో మహిళా దినోత్సవం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు స్వచ్ఛంద సంస్థలు ఆయా రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించాయి. అలాగే ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగినులను సైతం సన్మానించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. సమాజంలో మహిళలు రాణిస్తేనే దేశం ముందడుగు వేస్తుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పేర్కొన్నారు. – అక్షరటుడే, నెట్‌వర్క్



ఆర్మూర్ ఆర్టీసీ డిపోలో మహిళ ఉద్యోగులకు సన్మానం..





నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో..




వేల్పూర్ మండలం లక్కోర గ్రామ పంచాయతీలో..




ఎల్లారెడ్డి మండలం వెల్లుట్లలో..

## విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని గండివేట్ తండాలో ఆదివారం నేనావత్ రాజేస్‌కు చెందిన గేదె ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. రైతు మాట్లాడుతూ మృతిచెందిన గేదె రూ.70,000 ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

## బాల్కొండలో కంటి వైద్య శిబిరం



**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నిజామాబాద్‌కు చెందిన డాక్టర్ నవీన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ నవీన్, వైద్య సిబ్బంది దాదాపు 75 మందికి పైగా రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. శస్త్రచికిత్స అవసరమైన రోగులకు తమ ఆస్పత్రిలో ఉచితంగా సర్జరీలు నిర్వహి స్తామని డాక్టర్ నవీన్ తెలిపారు. కార్యక్రమంలో బాల్కొండ సర్పంచ్ గాండ్ల రాజేష్, ఉప సర్పంచ్ గాండ్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.